నమస్తే తెలంగాణ
# జనగామ
5 | వరంగల్, ఆదివారం 23 మార్చి 2025 | JANAGAON

**పంటలు చేతికొచ్చే వేళ** అకాల వర్షం రైతన్నను ఆగం చేస్తున్నది. శుక్రవారం రాత్రి, శనివారం తెల్లవారుజామున కురిసిన వానకు పలుచోట్ల వరి నేలవాలగా కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిపోతున్నది. ఇప్పటికే గిట్టుబాటు ధర లేక ఆందోళనలో ఉన్న మిర్చి రైతుకు ప్రకృతి పగబట్టినట్టు పరీక్ష పెడుతున్నది. వాతావరణం చల్లబడటం, మరికొన్ని రోజులు వర్షాలు పడే సూచనల నేపథ్యంలో టార్పాలిన్లు, పరదాలు కప్పుతూ పంటలను కాపాడుకోవాల్సి వస్తున్నది. భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని కాటారం, టేకుమట్ల, వాజేడు, మంగపేట, వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండలాల్లో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి వరి, మక్కజొన్న పంటలు నేలవాలాయి.

- నమస్తే నెట్‌వర్క్, మార్చి 22

## ■ అకాల వర్షం.. రైతుకు కష్టం..



మంగపేట: కల్లంలో ఆరబోసిన మిర్చి తడవకుండా టార్పాలిన్ షీట్లపైకి చేరిన వాన నీటిని ఎత్తిపోస్తున్న రైతులు



పర్వతగిరి: చింతనెక్కొండలో మక్కజొన్న చేనులో నీటిని ఎత్తిపోస్తున్న రైతులు



## ■ కొంగలే పువ్వుల్లా వాలి..

*మోడువారిన చెట్టు పచ్చని కళ తప్పి కట్టెలా మిగిలింది. ఎక్కడి నుంచి వచ్చిందో గానీ ఓ కొంగల గుంపు ఇలా ఎండిన మాను కొమ్మలకు పువ్వుల్లా వాలి 'కొంగొ'త్త అందాన్ని తెచ్చిపెట్టాయి. ములుగు జిల్లా వాజేడు మండలంలోని జగన్నాథపురం వై జంక్షన్ శివారులో అరుణాచల పురం గ్రామం వైపు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న వరి పొలం గట్టుపై కనిపించిన ఈ అరుదైన దృశ్యాన్ని 'నమస్తే' తన కెమెరాలో బంధించింది.*

- వాజేడు, మార్చి 22



చిట్యాల: శాంతినగర్‌లో తాగునీటి సమస్యపై స్థానికులను అడిగి తెలుసుకుంటున్న డీఈఈ శ్వేత, ఎంపీడీవో జయశ్రీ, ఏఈ గీత

# తాగునీటి గోస తీరింది..



పెద్దవంగర: పడమటి తండాలో గిరిజనులతో మాట్లాడుతున్న మిషన్ భగీరథ అధికారులు

- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందించిన అధికారులు
- గ్రామాల్లో పర్యటన.., సమస్య పరిష్కారానికి చర్యలు
- 'నమస్తే'కు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు

చిట్యాల/పెద్దవంగర, మార్చి 22: జయశంకర్ భూపాలపల్లి చిట్యాల మండలం కైలాపూర్ శివారు శాంతి నగర్‌లో, మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పడమటితండాలో తాగునీటికి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై శనివారం 'నమస్తే తెలంగాణలో 'దాహం దాహం –శాంతినగర్‌లో తాగునీటి గోస', పడమటితండాలో రానీ భగీరథ నీళ్లు అనే శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో అధికారులు స్పందించారు. శాంతినగర్‌లో గ్రామీణ నీటి పారుదలశాఖ, మిషన్ భగీరథ డీఈఈ శ్వేత, ఎంపీడీవో జయశ్రీ, ఎంపీవో రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గీత అధికారులు పర్యటించారు. తాగునీరు చేరుకోలేని ఇండ్లలోకి వెళ్లి పరిశీలించారు. గ్రామంలోని రెండు వాడల్లో ఒకటి ఎత్తులో, మరొకటి వంపులో ఉండడం వల్ల ట్యాంకు నీరు పల్లపు ప్రాంతంలో వాడకే పూర్తిస్థాయిలో వెళ్తున్నాయన్నారు. సమస్యను పరిష్కరించి ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీరు చేరేలా చూస్తామన్నారు. అంతేకాకుండా గ్రామంలో వాడకంలో లేని చేతిపంపులను పునరుద్ధరిస్తామని చెప్పారు. అలాగే అధికారులు పడమటితండాలో పర్యటించి, గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో శాంతినగర్‌వాసులు, పడమటి తండా వాసులు 'నమస్తే తెలంగాణ' దినపత్రికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన మైనింగ్ సర్వేయర్ అభ్యర్థులు

కృష్ణకాలనీ, మార్చి 22 : సింగరేణిలో సర్వేయర్ పోస్టులకు నోటిఫికేషన్ వేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవాధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను భూపాలపల్లి ఏరియాకు చెందిన మైన్ సర్వేయర్ హోల్డర్ చీకట్ల సతీశ్ శనివారం హైదరాబాద్‌లో కలిసి విన్నవించారు. వెంటనే స్పందించిన ఆమె నోటిఫికేషన్ వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని హామీ ఇచ్చారని సతీశ్ తెలిపారు.



కవితకు సమస్యను విన్నవించిన మైన్ సర్వేయర్ హోల్డర్ సతీశ్ కుమార్




# మనోడే.. ఇచ్చెయ్!

## గ్రేటర్ బిల్లుల చెల్లింపులో అవినీతి

- రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాని నిధులు
- ఆర్థిక సంవత్సరం చివరలో పన్నుల వసూలు
- పన్నుల నిధులతో వరుసగా బిల్లుల చెల్లింపులు
- వారంలోనే కాంట్రాక్టర్లకు రూ.10 కోట్లు
- ఓ ఎమ్మెల్యే చెప్పిన వారికి ఏకంగా రూ.8 కోట్లు
- క్యాంపు కార్యాలయంలో ప్రైవేట్ వ్యక్తి డీల్
- కమిషనర్ తీరుపై కొందరు కాంట్రాక్టర్ల అసంతృప్తి
- మంత్రికి, ఆమె భర్తకు ఫిర్యాదు చేయాలని నిర్ణయం

వరంగల్, మార్చి 22(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. గతంలో మంజూరైన పనులకు బిల్లులు చెల్లించడం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇదే పరిస్థితి ఉన్నది. నిధుల మంజూరు లేకపోవడంతో వరంగల్ నగరంలో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయి. గతంలో మంజూరైన పనులు చేసిన వారి పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నది. వారంలో ఆర్థిక సంవత్సరం ముగియనున్నది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూలు జోరుగా జరుగుతున్నది. రోజువారీగా పోగైన నిధులను జీడబ్ల్యూఎంసీ తక్కువ బడ్జెట్‌తో పూర్తయిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి పనుల బిల్లుల చెల్లింపులు చేస్తున్నది. ఈ చెల్లింపుల్లో జీడబ్ల్యూఎంసీలోని ఉన్నతాధికారులు దందా మొదలుపెట్టారు. తేదీల పరంగా పెండింగ్ బిల్లులు చెల్లించకుండా కమీషన్లు ఇచ్చిన వారి బిల్లులనే ఓకే చేస్తున్నారు. జీడబ్ల్యూఎంసీ సాధారణ నిధుల నుంచి రెండు రోజుల్లోనే రూ.10 కోట్ల బిల్లులు చెల్లించగా గ్రేటర్ పరిధిలోని ఓ ఎమ్మెల్యే సూచించిన కొందరికి ఏకంగా రూ.8 కోట్లు చెల్లించినట్లు తెలిసింది.

■ జీడబ్ల్యూఎంసీలో ఎప్పుడూ లేని విధంగా ఉన్నతాధికారి క్యాంపు ఆఫీసులోనే కాంట్రాక్టర్లు వచ్చి కమీషన్లపై చర్చలు జరుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. జీడబ్ల్యూఎంసీతో సంబంధం లేని ఓ ప్రైవేట్ వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ప్రైవేట్ వ్యక్తి ముందుగా కాంట్రాక్టర్లను కలిసి చర్చలు జరిపి తర్వాత.. ఆఫీసులోని ఓ అధికారి పక్కగా ప్లాన్ అమలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారి, పనుల పరిధిలోని అధికారుల మధ్య ఒప్పందం మేరకు కమీషన్లు ముట్టిన తర్వాత సదరు వ్యక్తి సూచన మేరకే బిల్లుల చెల్లింపులు జరుగుతున్నట్లు తెలిసింది. బిల్లులు చెల్లించే జాబితాలోని కాంట్రాక్టర్లను ప్రైవేట్ వ్యక్తి ఎమ్మెల్యే వద్దకు పంపించి ఫలానా వారి బి ల్లులు చెల్లించాలని జీడబ్ల్యూఎంసీ ఉన్నతాధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. తర్వాత అకౌంట్ల విభాగంలో చెల్లింపులు వేగంగా జరుగుతున్న ది. ప్రైవేట్ వ్యక్తితో ఒప్పందం ఉన్న కాంట్రాక్టర్లకు వెంటనే చెక్కులు రాసి ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో వసూళ్ల దందా నడుస్తున్నట్లు తెలిసింది. ఏండ్లుగా ఇదే సెక్షన్‌లో పని చేస్తున్న ఓ అధికారి ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నా యి. బిల్లులోని మొత్తాన్ని బట్టి చెల్లింపు సమయంలో వాటా నిర్ణయించి వసూలు చేస్తున్న పరిస్థితి ఉన్నది. అకౌంట్ సెక్షన్‌లోని ఆ అధికారిని ముందుగా కలిసిన వారికి.. ఫోన్లు చేసి మరీ బిల్లుల చెక్కులను అందజేస్తున్నారు. ఫలానా రోజు, ఫలానా సమయానికి వచ్చి చెక్కు తీసుకోవాలని చెబుతున్నారని తెలిసింది.

■ జీడబ్ల్యూఎంసీ ఉన్నతాధికారి క్యాంప్ ఆఫీసులోని ఓ అధికారి ముందుగా కొంద రు కాంట్రాక్టర్లతో ఒప్పందాలు చేసుకొని, వారిని ఎమ్మెల్యే వద్దకు పంపి బిల్లులు చెల్లించేలా ప్లాన్ వేసినట్లు ఆరోపణలున్నా యి. పనులు చేసిన తేదీల ఆధారంగా కా కుండా కమీషన్ల ప్రాతిపదికన బిల్లుల చెల్లింపులపై మిగిలిన కాంట్రాక్టర్లు మేయర్‌కు ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో మంత్రికి, ఆమె భర్తకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. కొందరు కాంట్రాక్టర్లు శనివారం రాత్రి మంత్రి భర్తను కలిసి బిల్లుల చెల్లింపుల దందా గురించి వివరించినట్లు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల నుంచి మంత్రి రాగానే ఆమెకు ఏకరువు పెట్టేందుకు వీరంతా సిద్ధమయ్యారు.

## తునికాకు బోనస్‌లో అవకతవకలు

- నాటి ఫారెస్ట్ రేంజ్ అధికారి అరెస్టు
- విచారణలో తీగ లాగితే కదిలిన డొంక

ఏటూరునాగారం, మార్చి 22 : ఏటూరునాగారం అటవీశాఖ నార్త్ రేంజ్ పరిధిలోని తునికాకు బోనస్‌లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టిన పోలీసులు నాటి రేంజ్ అధికారి బాలరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. తునికాకు బోనస్‌లో అక్రమాల ఉదంతం కొద్ది రోజుల కిత్రం వెలుగు చూసింది. 2023 సంవత్సరంలో తునికాకు సేకరించిన కూలీలకు బోనస్ మంజూరైంది. అనేక మంది కూలీలు తమకు రావాల్సిన బోనస్‌ను అధికారులు, కల్లెదారులు, ఇతరులు వారికి అనుకూలమైన పేర్లకు మళ్లించి అన్యాయం చేశారని ఆందోళన నిర్వహించి అటవీశాఖ ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో వారు విచారణ చేపట్టారు. ప్రధానంగా అటవీశాఖలోని వివిధ విభాగాల్లో ఔట్ సోర్సింగ్‌పై పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ తండ్రి, ఇద్దరు బేస్ క్యాంపు సిబ్బంది, ఇద్దరు ప్లాంటేషన్ల వర్కర్లు, మరో ఇద్దరు టింబర్ డిపోలో పనిచేస్తున్న వారి బ్యాంకు ఖాతాల్లో అటవీశాఖ అధికారి తరపున బోనస్ డబ్బులు సుమారు రూ.2.76 లక్షల వరకు జమైనట్లు విచారణలో వెలుగు చూసింది. అవకతవకల వెనుక నాటి నార్త్ రేంజ్ అధికారి ఉన్నట్లు వెలుగు చూసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానికంగా విధులు నిర్వర్తిస్తున్న డిప్యూటీ రేంజ్ అధికారి పది రోజుల క్రితం ఏడుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో ఆరుగురు తమకు ఎలాంటి సంబంధం లేదని, తమ ఖాతాల్లో జమ చేసిన డబ్బులను రేంజ్ అధికారికి ముట్ట జెప్పామని చెప్పారు. దీంతో అటవీశాఖ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు. బోనస్ పంపిణీ అవకతవకల్లో అప్పటి రేంజ్ అధికారి బాలరాజు హస్తం ఉన్నట్లు గుర్తించి శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. నాడు రేంజ్ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న బాలరాజు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాలో జమైన బోనస్ డబ్బులు డ్రా చేసి తన సొంతానికి వాడుకున్నట్లు నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేశామని తెలిపారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ పాల్గొన్నారు.

## లక్ష్మణ్‌బాపూజీ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పోచమ్మమైదాన్, మార్చి 22: ఆగస్టు 8న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్ర స్థాయి అవార్డుల కోసం ఔత్సాహిక చేనేత కళాకారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ వరంగల్ జిల్లా సహాయ సంచాలకుడు జీ రాఘవరావు ఒక ప్రకటనలో తెలిపారు. చేనేత కళాకారుల వృత్తి నైపుణ్యత, ప్రత్యేకతల ఆధారంగా ప్రభుత్వం అవార్డులకు ఎంపిక చేస్తుందని, రూ.25వేల నగదుతో పాటు చేనేత శాలువా, మెమెంటోతో సత్కరిస్తుందన్నారు. 2024 డిసెంబర్ 31 నాటికి 30 ఏండ్లు పైబడిన వారు, చేనేత రంగంలో పదేళ్లు, చేనేత డిజైనర్లు 25 ఏండ్లకుపైన వయసు కలిగి, ఐదేళ్ల అనుభవం తగ్గకుండా ఉండాలని తెలిపారు. అర్హులు దరఖాస్తు ఫారం నింపి ఏప్రిల్ 15లోపు సహాయ సంచాలకులు, చేనేత, జౌళిశాఖ వరంగల్ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.



నిందితులను అరెస్ట్ చూసిస్తున్న సీపీ

# బ్రాండెడ్ పేర్లతో మోసం

- రైతులకు నకిలీ పురుగు మందుల విక్రయాలు
- ఏడుగురి ముఠా సభ్యుల అరెస్ట్
- రూ. 78.63లక్షల విలువచేసే నకిలీ పురుగు మందులు, రెండు కార్లు, 6 సెల్‌ఫోన్లు, ప్రిటింగ్ మిషనరీ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సన్‌ప్రీత్ సింగ్

సుబేదారి, మార్చి22 : బ్రాండెడ్ కంపెనీ పేర్లతో నకిలీ, కాలం చెల్లిన పురుగు మందులను విక్రయించి రైతులను మోసం చేసి ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దమొత్తంలో నకిలీ పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శనివారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీసు కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ నిందితుల అరెస్ట్‌ను చూపి, వివరాలు వెల్లడించారు. సీపీ కథనం ప్రకారం.. వరంగల్ మట్టెవాడకు చెందిన ప్రధాన నిందితుడు ఇరుకుల్ల వేదప్రకాశ్, వరంగల్ లక్ష్మీపురానికి చెందిన మహ్మద్ సిద్దిక్ ఆలీ, పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌బాద్‌కు చెందిన నూక రాజేశ్, కరీంనగర్‌కు చెందిన సదాశివుడు, ములుగు జిల్లా గోవిందారావుపేటకు చెందిన ఎండీ రఫీక్, ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన ఆళ్లచెరువు శేఖర్, పరారీలో ఉన్న వరంగల్ జిల్లా దుగ్గొండికి చెందిన పొదిళ్ల సాంబయ్య, జైల్లో ఉన్న హైదరాబాద్‌కు చెందిన ముద్దగుల ఆదిత్య ముఠాగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించాలనే దురాశతో ప్రధాన నిందితుడు వేదప్రకాశ్ పురుగు మందుల విక్రయాల వ్యాపారుస్తుల నుంచి పెద్దమొత్తంలో కాలం చెల్లిన పురుగు మందులు కొనుగోలు చేసేవాడు. వీటి పాటుగా ముఠా సభ్యులతో కలిసి దనూక, టాటార్యాలిస్, బెయర్, ఆడ్మా, మరికొన్ని బ్రాండెడ్ కంపెనీల పేరుతో నకిలీ పురుగు తయారు చేసి రైతులకు విక్రయించేవారు. పోలీసులకు పక్కాసమాచారం రావడంతో మట్టెవాడ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా వ్యవసాయ అధికారులతో కలిసి మట్టెవాడ పోలీసుస్టేషన్ పరిధిలోని బొడ్రాయి ప్రాంతంలోని ప్రధాన నిందితుడు వేదప్రకాశ్ ఇంటిపై దాడి చేసి, ముగ్గురు నిందితులు సిద్దిక్, రాజేశ్, సదాశివుడును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నకిలీ పురుగు మందులు తయారుచేస్తున్న శేఖర్, విష్ణువర్ధన్ గోదాములపై దాడి చేసి, వారి నుంచి నకిలీ పురుగు మందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితుల నుంచి 78.63లక్షల విలువ చేసే గడువు ముగిసిన పురుగుమందులు,నకిలీ పురుగు మందులు,రెండు కార్లు,ఆరు సెల్‌పోన్లు, నకిలీ పురుగు మందుల తయారీకి ఉపయోగించిన మిషనరీ, ప్రిటింగ్ సామగ్రి స్వాధీనం చేసుకున్నామని సీపీ తెలిపారు. ఈముఠాను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన సెంట్రల్ జోన్ డీసీపీ సలీమా,టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్,వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్,ఇన్‌స్పెక్టర్లు రాజు,గోపి,ఎస్సైలు వంశీకృష్ణ,నవీన్, సిబ్బందిని సీపీ అభినందించారు.



శుభ్రం చేయకపోవడంతో పాకురుపట్టిన ట్యాంకు

# కామన్ మెస్..
# నో నీట్‌నెస్

## కామన్‌మెస్‌ను శాసిస్తున్న ఓ క్యాజువల్ లేబర్..

కామన్‌మెస్‌ను ఓ క్యాజువల్ లేబర్ శాసిస్తున్నాడని పలువురు విద్యార్థులు అతడి తీరుపై మండిపడుతున్నారు. హాస్టల్‌లో అతను చెప్పిందే వేదం అన్నట్లుగా అంతా అతడి కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు సమాచారం. 'ప్రభుత్వం మాదే, వీసీ మావోడే' అన్నట్లు వ్యవహరిస్తున్నారని, అందరూ బదిలీపై వెళ్లగా అతను మాత్రం అందులోనే తిష్టవేసి కామన్‌మెస్‌ను ఏలుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. అతడి తీరుపై వర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.




కాకతీయ యూనివర్సిటీలోని కామన్‌మెస్

**పర్యవేక్షణ లేదు.. పరిశుభ్రత లేదు..** భోజనంలో నాణ్యత అసలే లేదు. ఇదీ కేయూ హాస్టళ్ల దుస్థితి. ఇక కామన్‌మెస్‌లో ఎక్కడచూసినా పరిసరాలన్నీ చెత్త, దుర్గంధం, పాకురు పట్టడం, మరుగుదొడ్లు కంపుకొడుతుండడంతో ముక్కు మూసుకోవాల్సి వస్తున్నది. వర్సిటీ అధికారుల పట్టింపులేని తనం, కేర్‌టేకర్ ఇష్టారాజ్యం వల్ల విద్యార్థులు సరిపడా టిఫిన్, భోజనానికీ నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.

- హనుమకొండ చౌరస్తా, మార్చి 22

## కేయూ హాస్టళ్లలో సమస్యల తిష్ట

- భోజనంలో లోపించిన నాణ్యత
- కొరవడిన వర్సిటీ అధికారుల పర్యవేక్షణ
- అలా వచ్చి ఇలా వెళ్తున్న కేర్‌టేకర్లు
- మెస్‌ను శాసిస్తున్న ఓ క్యాజువల్ లేబర్



అధ్వానంగా చెత్తాచెదారం

కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్లలో సమస్యలు తిష్ట వేశాయి. అడుగడునా అసౌకర్యాలు విద్యార్థులను వెక్కిరిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం కరువైంది. వెయ్యి మంది విద్యార్థులకు ఉపయోగపడే కామన్‌మెస్‌లో నాణ్యత లోపించడంతో విద్యార్థులు ఆందోళనకు దిగాల్సిన పరిస్థితి దాపురించింది. కామన్‌మెస్ భోజనంలో నాణ్యత లేదని, పురుగులు, ప్లాస్టిక్ కవర్లు వస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు, స్విచ్‌బోర్డుల సమస్యతోపాటు మరుగుదొడ్లు అపరిశుభ్రంగా, విద్యార్థులు వాడుకోలేని స్థితిలో ఉన్నాయి. వర్కర్స్ సరిపడా లేనందున విద్యార్థులకు ఉదయం టిఫిన్ అందించలేకపోతున్నారు. చాలామంది విద్యార్థులు ఆ పూటకి పస్తులు ఉంటున్నారు. విద్యార్థులకు సరిపడా భోజనం అందడంలేదు. బాత్రూమ్‌ల్లో వాటర్ లీకేజ్ వల్ల వస్తున్న మురికినీరు అక్కడక్కడా నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతున్నది. విపరీతమైన దోమలతో రోగాలబారిన పడుతున్నామని, టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉండి గదుల్లోకి దుర్వాసన వస్తున్నదని విద్యార్థులు వాపోతున్నారు. తాము అనారోగ్యానికి గురవుతున్నా అధికారుల తీరు మారడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీళ్ల ట్యాంకును సైతం శుభ్రం చేయకపోవడంతో పాకురు పట్టిపోయిందన్నారు. ఇక హాస్టళ్లలో ఉండాల్సిన కేర్‌టేకర్లు అలా వచ్చి ఇలా వెళ్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కేర్‌టేకర్లు అందుబాటులో ఉండడంలేదని, వీసీ, హాస్టల్ డైరెక్టర్ నిర్లక్ష్యంతో తాము ఇబ్బందిపడుతున్నామన్నారు. ఇటీవల స్కాలర్స్ హాస్టల్ రిఫ్రిజిరేటర్‌లో బల్లిపడిన నీళ్లు తాగడంతో పరిశోధక విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టళ్లలోని కొన్ని గదుల్లో బెడ్స్ ఉన్నాయని, మరికొన్ని గదుల్లో మొత్తానికి లేకపోవడంతో నేలపైనే పడుకుంటున్నామన్నారు.

# వ్యవసాయరంగానికి మొండి చేయి

- నిరాశపర్చిన రాష్ట్ర బడ్జెట్
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు లేఖ



నర్సంపేట, మార్చి 22: రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యమివ్వలేదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. దీనిపై శనివారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రెండు పేజీల లేఖ రాశారు. ఈ సందర్భంగా పెద్ది విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు వ్యవసాయానికి, రైతులకు ఇచ్చిన హామీలకు ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులకు పొంతన లేదన్నారు. రూ.2 లక్షల వరకు రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక కొద్ది మందికే మాఫీ చేశారని పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు. వరంగల్ జిల్లాలో 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందనీ, ఇంకా 60 శాతం మంది రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. అనేక మంది రైతులు ప్రైవేట్ ఫైనాన్స్‌ల్లో బంగారాన్ని కుదువబెట్టి, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు తెచ్చి బ్యాంకులో కట్టి రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ బడ్జెట్ తీవ్ర నిరాశ పర్చిందన్నారు.

**వ్యవసాయ కూలీలకు మొండిచేయి..**

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టి మోసం చేసిందని విమర్శించారు. భవిష్యత్‌లో ఈపథకం కొనసాగుతుందన్న నమ్మకం లేదని చెప్పారు. కౌలు రైతులకు రైతు భరోసా అందిస్తామని మోసం చేసినట్లుగానే వ్యవసాయ కూలీలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తున్నదని పెద్ది దుయ్యబట్టారు. నర్సంపేట నియోజకవర్గానికి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రూ.60 కోట్లు వ్యవసాయ యాంత్రీకరణకు సబ్సిడీ రూపంలో నిధులు కేటాయించగా, ప్రస్తుతం ఆ పథకాన్ని నిలిపివేశారని పెద్ది గుర్తు చేశారు. వ్యవసాయ మోటర్లు, పైపులు తీసుకున్న రైతులకు, కంపెనీలకు బిల్లులు చెల్లించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని అర్థమౌతుందన్నారు. రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర చెల్లిస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ చెల్లిస్తుందనీ, అది కూడా పూర్తిస్థాయిలో అంద డం లేదన్నారు. మార్కెట్‌లో మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు వ్యాపారులు మార్కెట్లో సిండికేట్‌గా మారి దోపిడీ చేయడంతో రైతుకు పెట్టుబడి కూడా రావడంలేదన్నారు.

**ఆయిల్‌పామ్ రైతులకు ప్రోత్సాహం కరువు**

ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పినా బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం బాధాకరమని పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. వేలాది ఎకరాల్లో రైతులు ఆయిల్‌పామ్‌ను సాగు చేశారని, సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి సర్కారు నిధులు కేటాయించాలని కోరారు. హార్టికల్చర్ యూనివర్సిటీ కేంద్రానికి కేవలం స్వల్పకాలికంగానే నిధులు కేటాయించారని, వేతనాలు, నిర్వహణకు మాత్రమే ఇవి సరిపోతాయని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కొత్తగా మంజురైన హార్టికల్చర్ రీసెర్చ్ కేంద్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి మండలానికి కొత్తగా మంజూరైన హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎమ్మెల్యే, జిల్లా మంత్రులు దీనిపై చొరవ చూపకపోవడం, అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడమేనన్నారు.

మరిన్ని వార్తలు 16వ పేజీలో..